సాక్షి ఖమ్మం
ఆదివారం । 27 । జూలై । 2025



.. త్యాగాలు చిరస్మరణీయం
దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.
8లో



వ్యాధుల కట్టడిపై దృష్టి
సీజనల్ వ్యాధుల కట్టడికి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జెడ్పీ సీఈఓ దీక్షారైనా సూచించారు.
8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

సైన్స్ బొమ్మలు.. గణిత సూత్రాలు!


తిరుమలాయపాలెం పాఠశాలలో చేతులపై చిత్రాలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు


చేతులపై సైన్స్ పాఠాల్లోని బొమ్మలు

విద్యాసంస్థల్లో వినూత్నంగా మెహందీ వేడుకలు

- విద్యార్థులకు ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయుల కసరత్తు
- చేతులపై పాఠాల్లోని బొమ్మలు వేయిస్తూ అవగాహన

ఖమ్మంగాంధీచౌక్/తిరుమలాయపాలెం: మహిళలు, యువతులే కాక విద్యార్థినులకు చేతులపై గోరింటాకు పెట్టుకోవడాన్ని సంబురంగా భావిస్తారు. గోరింటాకు ఆరోగ్యపరంగానూ మంచిదని నమ్ముతాతారు. అయితే, గోరింటాకు చెట్లు కనుమరుగవడం.. ఆకులు తెంపి, రుబ్బి పెట్టుకోవడం సాధ్యం కాక చాలా మంది దూరమవుతున్నారు. ఫలితంగా మెహందీ కోన్లు అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులకు సంప్రదాయాన్ని వివరిస్తూనే ఇటు పాఠ్యాంశాలపై అవగాహన మరింత పెరిగేలా జిల్లాలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచించారు. ఇందులో భాగంగానే పాఠశాలల్లో మెహందీ వేడుకలు నిర్వహిస్తూ విద్యార్థినుల చేతులపై గణిత పాఠ్యాంశాల్లోని సూత్రాలు, సైన్స్ పాఠాల్లోని బొమ్మలు వేయిస్తున్నారు. తద్వారా ఆయా పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తారని, ఇంకోపక్క సంప్రదాయం కొనసాగించినట్లవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అటు చదువు... ఇటు విజ్ఞానం

గోరింటాకుతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరిస్తూ సాధారణ డిజైన్ల స్థానంలో పాఠాల్లోని అంశాలను చేర్చారు. కొందరేసి విద్యార్థులను బ్యాచ్‌లుగా విభజించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు కేటాయిస్తున్నారు. ఆయా ఉపాధ్యాయులు వారు బోధించే గణితం, సైన్స్ తదితర సబ్జెక్టు పాఠ్యాంశాల్లో బొమ్మలను విద్యార్థినుల చేతులపై వేయిస్తున్నారు. గణితం విషయానికి వస్తే సూత్రాలు, నమూనాలు, గుర్తులు, రేఖాగణితం, త్రికోణమితి సూత్రాలు వంటి అంశాలు చేతులపై రూపుదిద్దుకుంటున్నాయి. ఇక భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు చెందిన చిత్రాలు, సమీకరణాలకు సంబంధించిన అంశాలను కూడా చేతులపై గోరింటాకుతో చిత్రీకరిస్తున్నారు. జిల్లాలోని లు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గోరింటాకుతో ఈ వేడుకలు నిర్వహిస్తుండగా విద్యార్థినులు తమ చేతులపై గోరింటాకుతో వేసుకున్న చిత్రాలను తరచూ చూడడం ద్వారా ఆయా అంశాలపై పట్టు సాధిస్తారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఇదే సమయాన బ్యాచ్‌ల వారీగా చిత్రాలు వేశాక ఉత్తమమైనవి ఎంపిక చేసి బహుమతులు ఇస్తుండడంతో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారు.


ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పోటాపోటీగా బొమ్మలు వేస్తున్న విద్యార్థినులు

సండే స్పెషల్

ఇది కొత్తగా ఉంది...



గోరింటాకుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చర్మ వ్యాధుల నుంచి రక్షించడంతో పాటు శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. ఇప్పుడు మ్యాథ్స్, సైన్స్ సంబంధించిన అంశాలను చేతులపై వేయడం కొత్తగా ఉంది. ఈ విధానంతో ఆయా అంశాలపై పట్టు పెరుగుతుంది.
– మధుశాలిని, పదో తరగతి

ఎప్పటికీ మరిచిపోకుండా..



గోరింటాకుతో చేతులపై వివిధ డిజైన్లను చిత్రించవచ్చు. మా పాఠశాల ఉపాధ్యాయులు డిజైన్ల స్థానంలో గణితం, జీవ, భౌతిక శాస్త్రాలకు అంశాలను వేయించారు. చేతులపై ఉన్న ఫార్ములాలు తరచూ చదువుతుండడంతో ఎట్టి పరిస్థితుల్లో మరిచిపోయే అవకాశం ఉండదు.
– దేవహర్షిని, పదో తరగతి

ఆసక్తిగా పాల్గొన్నారు..



అందం, ఆరోగ్యంతో పాటు విజ్ఞానాన్ని పెంచేందుకు సైతం గోరింటాకు దోహదపడుతుందని గుర్తించాం. అందుకే గోరింటాకుతో విద్యార్థినుల చేతులపై పాఠ్యాంశాలకు సంబంధించిన చిత్రాలు గీయించాం. ఈ విషయంలో పోటీలు నిర్వహించడంతో అంతా ఆసక్తిగా పాల్గొన్నారు.
– వి.సునీత, గణిత ఉపాధ్యాయురాలు, ఖమ్మం

విద్యార్థుల్లో ఉత్సాహం...



మానవ అవయవాల బొమ్మల ఆధారంగా విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధిస్తాం. అయితే, బొమ్మలు ఎప్పటికీ గుర్తుండడం, అవి గీసేలా విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలని నిర్ణయించుకున్నాం. ఈక్రమంలోనే మెహందీతో వారి చేతులపై బొమ్మలు వేయించగా ఉత్సాహంగా ముందుకొచ్చి పోటాపోటీగా పాల్గొన్నారు.
– పి.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, తిరుమలాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం


అదనపు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికిఅర్చకులు పంచామృతంతో అభిషేకాలు చేశారు. అలాగే, పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. కాగా, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా రాగా అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించి పూజలు చేయించారు. ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించాలి


కేసుల వివరాలు ఆరా తీస్తున్న సీపీ సునీల్‌దత్

బోనకల్: సమస్యలతో వచ్చే ప్రజలకు భరోసా కల్పించేలా పోలీసుల పనితీరు ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. బోనకల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన స్టేషన్ నిర్వహణ, ఉద్యోగుల పనితీరు, పెండింగ్ కేసుల విచారణపై ఆరాతీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పెట్రో కార్, బీట్ సిబ్బంది విధినిర్వహణలో చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే, పాత నేరస్తుల కదలికలపై నిఘా వేయాలని, రెండు రాష్ట్రాల సరిహద్దులో అక్రమ రవాణా నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ చేట్టాలని సీపీ తెలిపారు. ఎస్‌ఐ పొదిలి వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ న్యాయవాద పట్టభద్రులకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: షెడ్యూల్డ్ కులాల న్యాయవాద పట్టభద్రులకు ఉచిత శిక్షణతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించే పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన ఈ పథకానికి గాను ఉమ్మడి జిల్లాలోని అర్హులైన న్యాయవాద పట్టభద్రులు ఈనెల 31లోగా ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ సూచించారు. ఎంపికైన వారికి మూడేళ్ల పాటు సివిల్, క్రిమినల్ లాలో ఉచిత శిక్షణతో పాటు పుస్తకాలు, స్టేషనరీ కోసం రూ.50వేలు, నెలకు రూ.3వేల ఉపకార వేతనం, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తాయని తెలిపారు. రూ.2 లక్షల లోపు ఆదాయం కలిగిన వారు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, మార్కుల జాబితాలు, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్‌తో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

హైవే భూసేకరణకు నోటిఫికేషన్

ఖమ్మం అర్బన్: నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి(163జీ) విస్తరణలో భాగంగా జిల్లాలో అవసరమైన భూసేకరణకు కేంద్ర రోడ్లు, రవాణా శాఖ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వరంగల్ నుంచి ఖమ్మం వరకు జిల్లాలోని 203.8 కి.మీ. నుంచి 220.48 కి.మీ మధ్య పాయింట్లలో భూములు సేకరించనున్నారు. ఈమేరకు ఖమ్మం రూరల్ మండలం తీర్థాల రెవెన్యూ పరిధి పది సర్వే నంబర్లు, ఒక డొంక రహదారి, రఘునాథపాలెం మండలంలోని రఘునాథపాలెం, వేపకుంట్ల, వి.వెంకటాయపాలెం గ్రామాల్లో పదికి పైగా సర్వే నంబర్ల పరిధిలో భూముల సేకరణకు గుర్తించారు. మొత్తంగా 5.978 హెక్టార్ల భూమి సేకరిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈమేరకు అభ్యంతరాలు ఉంటే 21 రోజుల్లోగా ఖమ్మం ఆర్డీఓకు లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. ఆపై అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని నోటిఫికేషన్ వెల్లడించారు.

మోదీ పాలన దేశానికే ప్రమాదకరం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో మోదీ నేతృత్వాన సాగుతున్న పాలన దేశానికి ప్రమాదకరంగా పరిణమిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన ఖమ్మం డివిజన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ ఒక మతతత్వ పార్టీ అని.. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక రంగంలో సంస్కరణల్లో వేగం పెంచారని ఆరోపించారు. ముఖ్యంగా రైల్వే, రక్షణ, విద్య, వైద్య, బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, కార్మిక చట్టాల సవరణతో అందరికీ నష్టం ఎదురుకానుందని తెలిపారు. అయితే, బీజేపీ మతతత్వాన్ని కార్పొరేట్ శక్తులు కూడా సమర్థిస్తుండడం అత్యంత ప్రమాదకరమని చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో మైనారిటీలపై దాడులు చేస్తూ, పౌరసత్వం నిరూపించుకోవాలని చెబుతుండడం బీజేపీ తీరును తేటతెల్లం చేస్తోందని తెలిపారు. ఈమేరకు కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్మించాలని తమ్మినేని పిలుపునిచ్చారు. కాగా, కేంద్రప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను వ్యతిరేకిస్తుండగా.. కులగణన, రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్రంలో బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో పాటు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బొంతు రాంబాబు, ఎర్ర శ్రీనివాసరావు, విష్ణువర్ధన్, బండా రమేష్, ఎం.ఏ.జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, షేక్ మీరా సాహెబ్, దొంగల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా నగర అభివృద్ధి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర అభివృద్ధి ప్రణాళికాయుతంగా జరిగేలా కార్యాచరణ రూపొందించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 3వ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటివరకు రూ.200 కోట్ల నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. మరో రూ.150 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం లభించాల్సి ఉందని చెప్పారు. అంతేకాక ఆగస్టు 15నాటికి కనీసం రూ.100 కోట్ల నిధులు ఖమ్మం కార్పొరేషన్‌కు మంజూరు కానున్నాయని తెలిపారు. ఇప్పటికే రూ.280 కోట్లతో తీగల వంతెన, రూ.160 కోట్లతో మోడల్ మార్కెట్, రూ.30 కోట్లతో ఖిల్లా రోప్‌వే, రూ.200 కోట్లతో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆర్‌డీఓ నర్సింహారావు, కేఎంసీ సహాయక కమిషనర్ అనిల్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ రంజిత్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, ఏసీపీ వసుంధర, విద్యుత్‌శాఖ డీఈ రామారావు, తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్ లకావత్ సైదులుతో పాటు కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, నల్లమల వెంకటేశ్వర్లు, మలీదు మనీష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వరదలు ఎదుర్కొనేలా అప్రమత్తత

- యూరియా అక్రమ రవాణా కట్టడిపై దృష్టి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాల నేపథ్యాన వరద ముంపు ఎదురైతే సమర్థవంతంగా ఎదుర్కొనేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన ఆయన శనివారం హైదరాబాద్ నుండి వీసీ ద్వారా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, మున్నేటి వరదల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూడాలని తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలే కాక ఆపదమిత్ర వలంటీర్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఇక యూరియా అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షిస్తూ రైతులకు సరఫరా చేయించాలని సూచించారు. జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వరద విపత్తుల నిర్వహణ కోసం కలెక్టరేట్, కేఎంసీల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశామని, మున్నేటి పరీవాహక ప్రాంతంలో ఆపదమిత్రులుగా యువతకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల వాతావరణ పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని చెప్పారు. ఇక యూరియా లభ్యత, సరఫరాను పర్యవేక్షిస్తుండగా, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సీపీఓ శ్రీనివాస్, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.పుల్లయ్య, డీఎంహెచ్‌ఓ కళావతి బాయి, ఇరిగేషన్ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. జనంలో భయం

జిల్లాలో వైరల్ ఫీవర్ల వ్యాప్తి

- అన్నిచోట్ల నానాటికీ పెరుగుతున్న కేసులు
- తల్లాడ, తిరుమలాయపాలెంలో డెంగీ జాడలు


తల్లాడ శ్రీనగర్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



ఖమ్మం పెద్దాస్పత్రిలో ఓపీ విభాగం వద్ద రద్దీ

ఖమ్మంవైద్యవిభాగం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లోనూ రహదారుల వెంట మురుగునీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇదికాక విరేచనాలు, వాంతులు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వేధిస్తుండడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

వర్షాలతో పాటే వ్యాధులు

జిల్లాలో జోరు వర్షాలతో దోమల వ్యాప్తి పెరిగింది. పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యతో ఈ పరిస్థితి ఎదురవుతుండగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 42,460 మంది విషజ్వరాల బారిన పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో సగం కేసులు రెండు నెలల్లోనే నమోదు కావడం గమనార్హం. ఇటీవల కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట నీరు నిలవడం దోమల వృద్ధికి కారణమవుతుండగా.. ముందు ముందు జ్వరాల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నెల ప్రారంభం నుంచి వర్షాలు కురిసే వరకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఆ సమయాన వాతావరణంలో మార్పులు, ఎండ వేడితో చాలామంది డీహైడ్రేషన్, వాంతులు, జ్వరం తదితర సమస్యలతో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు వర్షాలతో నీరు నిలిచి దోమల కారణంగా జ్వరాలు వేధిస్తున్నాయి.

▌చంద్రుతండాలో ఇద్దరికి డెంగీ

తిరుమలాయపాలెం: గత ఏడాది జిల్లాలోనే అత్యధికంగా డెంగీ కేసులు నమోదైన తిరుమలాయపాలెం మండలంలో ఈసారి కేసులు మొదలయ్యాయి. మండలంలోని చంద్రుతండాకు చెందిన ఒకే కుటుంబంలో ఇద్దరు మహిళలకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన పరీక్షలో డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అయితే, చంద్రుతండా సహా మండలంలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడం, ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించకపోవడంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

▌డెంగీతో వణుకుతున్న తల్లాడ

తల్లాడ: తల్లాడ వాసులు డెంగీ భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే డెంగీతో యోగా ఇన్‌స్ట్రక్టర్ కందుల శ్రీదేవి మృతి చెందగా, ఆమె కుటుంబానికే చెందిన మరో ఇద్దరు డెంగీ బారిన పడ్డారు. గత ఏడాది కూడా తల్లాడలో పది డెంగీ కేసులు నమోదు కావడం.. ఈసారి ఒకరు మృతి చెందడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. కాగా, మహిళ మృతితో శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీజ తల్లాడలో పర్యటించగా.. ఆమె ఆదేశాలతో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు. ఇప్పటికే 1,184 కుటుంబాల్లో 4,463 మందిని పరీక్షించారు. అయితే, తల్లాడలోని ఏ వీధిలో చూసినా అపరిశుభ్రత రాజ్యమేలుతుండడం, డ్రెయినేజీల్లో మురుగు నీరు తొలగించకపోవడంతోనే దోమలు, ఆపై వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి మరింత విషమించక ముందే స్పందించాలని కోరుతున్నారు.

మొదలైన సీజనల్ వ్యాధులు

ఈసారి వర్షాలు ఆలస్యం కాగా.. ఇప్పుడిప్పుడే జ్వరపీడితులు పెరుగుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు డెంగీ కేసులు 16 నమోదు కాగా, ఒకరికి చికున్‌గున్యా, ఇద్దరు మలేరియా బారిన పడ్డారు. ఇవి కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైనవే కాగా ప్రైవేట్ ఆస్పత్రుల లెక్క తేలితే పెరిగే అవకాశముంది. ఈసారి డెంగీ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఒకేసారి కేసులు


తల్లాడకు చెందిన మహిళ గురువారం డెంగీతో మృతి చెందగా, ఆమె బంధువులు ఇద్దరు డెంగీతోనే చికిత్స పొందుతున్నారు. ఇక తిరుమలాయపాలెం మండలంలోనూ శనివారం రెండు కేసులు నమోదయ్యాయి. డెంగీ సోకిన వారిలో తీవ్ర జ్వరం, తల నొప్పి, కళ్లు తెరవలేకపోవడం, కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు, రక్తపోటు వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. అలాకాకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

జిల్లాలో గత కొన్నేళ్లుగా నమోదైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా కేసులు

ఏడాది	డెంగీ	మలేరియా	చికున్‌గున్యా	వైరల్‌జ్వరాలు
2022	711	02	98	65,791
2023	530	00	00	73,869
2024	529	00	00	82,006
2025	16	02	02	42,460

(ఇప్పటి వరకు)

ప్రభావం అంతగా లేదు..



జిల్లాలో సీజనల్ వ్యాధుల ప్రభావం పెద్దగా లేదు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా అదుపులోనే ఉన్నాయి. అన్నిచోట్ల ఫాగింగ్, డ్రెయినేజీల్లో స్ప్రే చేయిస్తున్నాం. దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వదులుతున్నాం. ఇదేసమయాన ప్రజలు కూడా దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కిటికీలకు మెష్‌లు, ఇళ్లలో దోమ తెరలు వాడాలి.
– డాక్టర్ కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన


రామయ్యకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజ లు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించా రు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి

● జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనా

కూసుమంచి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనా సూచించారు. కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేసిన ఆమె పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో పర్యటించారు. పీహెచ్‌సీ తనిఖీ సందర్భంగా జ్వరాలో వస్తున్న వారు, అందుతున్న చికిత్సపై మెడికల్ ఆఫీసర్ సాయికుమార్ ద్వారా ఆరా తీశారు. అవసరమైన గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అలాగే, పాలేరు బస్టాండ్‌ను సందర్శించిన సీఈఓ రోడ్డు సమస్యపై డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆతర్వాత పాలేరులోని పలు వీధుల్లో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆతర్వాత నాయకన్‌గూడెంలోని హైస్కూల్, హెల్త్ సబ్ సెంటర్‌ను సీఈఓ దీక్షారైనా తనిఖీ చేయడంతో పాటు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఈజీఎస్ ఏపీఓ అప్పారావు, గ్రామ కార్యదర్శులు హరీష్, రాజేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లన్ననగర్‌లో పోడు వివాదం

కొణిజర్ల: మండలంలోని ఎల్లన్ననగర్‌లో పోడు సాగుదారులు, అటవీ ఉద్యోగుల మధ్య వివాదం చోటు చేసుకుంది. మండలంలోని గుబ్బగుర్తి ఫారెస్ట్ రేంజ్ పరిధి ఎల్లన్ననగర్ వాసులు పోడు కొట్టి సాగు చేసుకుంటున్నారు. అయితే, 2008 తర్వాత పోడు కొట్టారంటూ భూములను సర్వే చేయకపోగా అటవీ హక్కు పత్రాలు ఇవ్వలేదు. అయినా కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామంటూ గ్రామస్తులు ఈ సారి కూడా పత్తి విత్తనాలు వేశారు. కాగా, అటవీ భూమిలోనూ దున్నారంటూ అటవీ ఉద్యోగులు విజయ, శ్రీను, సిబ్బంది అక్కడకు వెళ్లి పత్తి మొక్కలు తొలగించేందుకు యత్నించారు. ఈక్రమాన గ్రామస్తులు రావడంతో వాగ్వాదం జరిగింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో ఉద్యోగులు పత్తి మొక్కలు తొలగించారని, వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేసిన భూమిని గ్రామస్తులు దున్నడమే కాక తమపై దౌర్జన్యం చేశారంటూ ఎఫ్ఎస్ఓ ఉపేంద్రయ్య ఆధ్వర్యాన పరస్పరం ఫిర్యాదుచేసుకోగా పోలీసులు విచారణ చేపట్టారు.

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

కార్గిల్ దివస్ వేడుకల్లో కలెక్టర్ అనుదీప్



అమర జవాన్ల స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్, తదితరులు



కొత్తూరులో రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే రాగమయి

ఖమ్మంమయూరిసెంటర్: సైనికుల త్యాగాలను చిరస్మరణీయమని.. వారి సేవలను ఎల్లవేళలా గుర్తు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ఫ్రీడమ్ పార్క్‌లో శనివారం జరిగిన చేపట్టిన కార్గిల్ విజయ దివస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. ప్రజలంతా ప్రశాంతంగా, అభివృద్ధి పథంలో సాగడానికి సరిహద్దులో కష్టపడుతున్న సైనికులే కారణమని తెలిపారు. దేశ సరిహద్దులో 25 ఏళ్ల క్రితం సైన్యం ప్రాణాలకు తెగించి పోరాడడం ద్వారా కార్గిల్ విజయాన్ని అందించారని చెప్పారు. అనంతరం అమరవీరుల కుటుంబసభ్యులను సన్మానించడమే కాక ఫ్రీడమ్ పార్క్‌లో కలెక్టర్ మొక్కలు నాటారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఎం.చంద్రశేఖర్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీసీపీ రామోజీ రమేష్, వింగ్ కమాండర్ సురేంద్ర, మాజీ సైనికుల అసోసియేషన్ బాధ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

సత్తుపల్లి: నూతన రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులు నిరంతరం సాగుతాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సత్తుపల్లి మండలం కొత్తూరు రైతువేదికలో శనివారం రేషన్‌కార్డు మంజూరు పత్రాలను ఆయన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి అందజేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో 2,200 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. తద్వారా వారికి సన్న బియ్యం అందడమే కాక ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని చెప్పారు. జిల్లాలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సత్తుపల్లి ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. ఈ సమావేశంలో కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, సింగరేణి పీఓ నర్సింహారావు, డీఎస్ఓ కె.చంద్రకుమార్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుండ్ల కృష్ణయ్య, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, నారాయణవరపు శ్రీనివాసరావు, తోట సుజలరాణి, కొప్పుల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'సర్వేలతో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న ప్రభాకర్, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సర్వేల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్.ప్రభాకర్ పేర్కొన్నారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. బీసీల హక్కులను తాకట్టు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలన్నది ఆ పార్టీ కుట్రగా భావిస్తున్నామని చెప్పారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సకల జనుల సర్వేలో బీసీల జనాభా 55శాతమని తేలగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేలో బీసీల జనాభా తక్కువగా ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాక 42శాతం రిజర్వేషన్లతో నిజమైన బీసీలు నష్టపోనున్నందున బీజేపీ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు గల్లా సత్యనారాయణ, సన్నె ఉదయప్రతాప్, తాండ్ర వినోద్‌రావు, నున్న రవికుమార్, నంబూరి రామ లింగేశ్వర్‌రావు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి నుంచి కార్లు, బైక్‌లు స్వాధీనం

కల్లూరు: సామాన్యుల ఆర్థిక అవసరాలను ఆసరాగా మలుచుకుని అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్న కల్లూరుకు చెందిన మహ్మద్ హబీబ్ అలియాస్ వడ్డీల బాబాపై కేసు నమోదు చేశారు. అంతేకాక ఆయన పలువురి నుంచి తాకట్టు పెట్టుకున్న రూ.90 లక్షల విలువైన నాలుగు కార్లు, 15ద్విచక్ర వాహనాలను శనివారం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై హరిత తెలిపారు. పలువురికి అప్పులు ఇస్తున్న హబీబ్ ఇందుకు సుమారు రూ.10 వడ్డీ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. అనుమతి లేకుండా తాకట్టు వ్యాపారం చేయడమే కాక అధిక వడ్డీ వసూలు చేస్తుండడంతో హబీబ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా తాకట్టు వ్యాపారాలు చేస్తే వారి సమాచారం ఇవ్వాలని ఏసీపీ రఘు ఓ ప్రకటనలో సూచించారు.

భవిష్యత్ కోసమే పార్టీ మార్పు

మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాల

వైరారూరల్: బీఆర్ఎస్ తనకు ఎలాంటి అన్యాయం చేయకపోగా తగిన గుర్తింపు ఇచ్చిందని మధిర మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తెలిపారు. అయినా భవిష్యత్ కోసం పార్టీ మారాల్సి వస్తోందని చెప్పారు. ఆయన స్వగ్రామమైన వైరా మండలం కొండకొడిమలో శనివారం అనుచరులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్‌లో 11ఏళ్ల పాటు గౌరవించడమే కాక రాష్ట్ర స్థాయి పదవితో సముచిత స్థానం కల్పించారని తెలిపారు. అయితే, అభివృద్ధి, భవిష్యత్ కోసం కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకోగా, అనుచరులతో సంప్రదిస్తున్నానని వెల్లడించారు. ఈ సమావేశంలో ధూళిపాల నాగేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వరరావు, దొంతెబోయినస్వామి, కస్తాల చిన్నసత్యనారాయణ, వాకదాని వెంకటేశ్వరరావు, దొంతెబోయిన వెంకటేశ్వరరావు, పగడవరపు నర్సింహారావు, పుట్ట వెంకటేశ్వరరావు, దారా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్సకు వచ్చే వారితో మర్యాదగా మెలగాలి



కార్మికులకు సూచనలు చేస్తున్న సూపరింటెండెంట్

ఖమ్మంవైద్య విభాగం: చికిత్స కోసం వచ్చే వారితో పాటు సహాయకులతో పట్ల గౌరవంగా మెలగాలని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ సూచించారు. ఆస్పత్రి పేషంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ఆస్పత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడమే కాక సేవల్లో సహకారం అందించాలని తెలిపారు. అలాగే, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

మూర్ఛతో కేఎంసీ జవాన్ మృతి

ఖమ్మంక్రైం: విధులకు హాజరయ్యేందుకు బయలుదేరిన కేఎంసీ పారిశుద్ధ్య జవాన్ మూర్ఛ వ్యాధితో మృత్యువాత పడ్డాడు. ఖమ్మం రామన్నపేటకు చెందిన బాసిపోంగు అజయ్(32) 47వ డివిజన్‌లో పారిశుద్ధ్య జవాన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి విధులకు బయలుదేరిన ఆయనకు మార్గమధ్యలోనే మూర్ఛ రావడంతో 34వ డివిజన్ జవాన్ గణపతికి ఫోన్‌లో చెప్పాడు. దీంతో గణపతి వచ్చి అజయ్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతుడి తల్లి విజయశోభ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

పోలీసు అధికారి కుటుంబీకులు దౌర్జన్యం చేశారని ఫిర్యాదు

ఖమ్మంఅర్బన్: ఓ పోలీసు అధికారి కుటుంబీకులు తనపై దౌర్జన్యం చేశారని అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ శనివారం ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని అపార్టుమెంట్‌లో వేముల గణేష్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, అదే భవనంలో ఓ పోలీసు అధికారి నివాసం ఉంటున్నాడు. ఆయన కుమారుడు తన కారు వెనుకాల మరో కారు ఎందుకు పెట్టించావంటూ దాడి చేశాడని గణేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తన భార్య, మనమరాలిపైనా దురుసుగా ప్రవర్తించారని.. ఈ విషయం చెబితే పోలీస్ అధికారి దంపతులు సైతం దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ ఘటనపై పిర్యాదు అందగా విచారణ చేస్తున్నామని సీఐ భానుప్రకాష్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో శెట్టి లక్ష్మీనారాయణపై దాడి చేసి ఆయన మరణానికి కారణమైన సుంకర శివను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈనెల 19న మధ్యాహ్నం ఇంటి స్థలం గెట్టు విషయంలో గొడవ జరగగా, లక్ష్మీనారాయణ తలపై శివ ఇనుప రాడ్‌తో కొట్టడడంతో తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు కాగా శనివారం శివను అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు వైరా సీఐ సాగర్ తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

రఘునాథపాలెం: పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. మండలంలోని జీకే.బంజారతండాను శనివారం పరిశీలించిన ఆమె పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరాతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో అధికారులు కీలకంగా వ్యవహరిస్తూనే ప్రజలను సైతం భాగస్వాములను చేయాలని తెలిపారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూస్తూ దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారేపల్లి వాసి మృతి



రాజు (ఫైల్)

కారేపల్లి: ఊరూరా తిరుగుతూ గ్యాస్‌స్టౌల మరమ్మతుతో కుటుంబాన్ని పోషించే వ్యక్తి రోడ్డుప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.... కారేపల్లి మండలం మాధారం బుడిగ జంగాల కాలనీకి చెందిన తూరపాటి రాజు(32) ద్విచక్రవాహనంపై ఊరూరా తిరుగుతూ గ్యాస్‌స్టౌ రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం కూడా అలాగే వెళ్లగా పాల్వంచ మండలం సోములగూడెం క్రాస్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకు భార్య రమణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబంలో విషాదం నెలకొనగా, మాజీ సర్పంచ్ అజ్మీరా నరేష్‌నాయక్ తదితరులు నివాళులర్పించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

నేలకొండపల్లి: పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్తుండగా ట్రాక్టర్ ఇంజన్ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని మంగాపురం తండాకు చెందిన ధీరావత్ కేశ్యా (40) దుక్కిదున్నేందుకు శనివారం ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. అయితే, మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టి సమీప పొలంలో బోల్తా పడింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌పై నుంచి కేశ్యా దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కోర్టును బురిడీ కొట్టించేందుకే
బాబు కుట్ర

చంద్రబాబు ప్రభుత్వ సరికొత్త కుతంత్రం

ఈ నేపథ్యంలోనే వికాట్ కంపెనీలో సిట్ సోదాల డ్రామా

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ కుట్రలతో మరింతగా రెచ్చిపోతోంది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు అక్రమ కేసులతో తెగబడుతూ రాద్ధాంతం చేస్తోంది. ఈ క్రమంలో ఏకంగా న్యాయస్థానాలనే తప్పుదారి పట్టించేందుకు బరితెగిస్తోంది. ఆ పక్కా పన్నాగంతోనే... వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా కోర్టును బురిడీ కొట్టించేందుకు హైదరాబాద్‌లో సోదాల పేరుతో శనివారం కొత్త కుట్రకు తెరతీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై నమోదు చేసింది అక్రమ కేసేనని సిట్ దర్యాప్తు తీరే స్పష్టం చేస్తోంది. అందుకనే... టీడీపీ బాస్‌లకు అన్నింట్లోనూ 'ఎస్'అనే పోలీస్ అధికారులతో ఏర్పాటైన సిట్ దర్యాప్తులో ఒక్క ఆధారాన్నీ సేకరించలేకపోయింది. బెదిరింపులు, వేధింపులు, అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు తప్ప సాధించినదేమీ లేదన్నది తేటతెల్లమైంది. ఎల్లో మీడియా ద్వారా సాగిస్తున్న దుష్ప్రచార కుతంత్రమూ బెడిసికొడుతోంది. అసలు లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపించేందుకు పన్నిన పన్నాగం బెడిసి కొడుతుండడంతో చంద్రబాబు ప్రభుత్వం బెంబేలెత్తుతోంది. దర్యాప్తు పేరిట సిట్ చేస్తున్న హడావుడి... ఇదంతా అక్రమ కేసేనని స్పష్టం చేస్తోంది. దీంతో మరో కుతంత్రం రచించింది. హైదరాబాద్‌లో సోదాల డ్రామాను సృష్టించింది.

బాలాజీ గోవిందప్పను అక్రమంగా అరెస్టు చేసి 75 రోజులైంది. ఎలాంటి ఆధారాలు లేకుండా నెలల పాటు దర్యాప్తు రిమాండ్‌లో ఉంచడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. దీంతో బెయిల్ ఇవ్వాలని ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. బాలాజీ గోవిందప్ప తదితరులకు త్వరలో బెయిల్ ఖాయమని న్యాయ నిపుణులు సైతం స్పష్టం చేస్తున్నారు. మరోవైపు కేసు దర్యాప్తు ఎంతవరకు వచ్చిందని సిట్ అధికారులను కోర్టు నిలదీస్తోంది. ఇటీవల సమర్పించిన ప్రాథమిక చార్జ్‌షీట్‌లో బాలాజీ గోవిందప్ప, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తదితరుల పేర్లను ప్రస్తావించలేదు. అందుకని సాంకేతిక అంశాలతో కోర్టును తప్పుదారి పట్టించేందుకు సిట్ కొత్త ఎత్తుగడ వేసింది. ఈ క్రమంలోనే బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకునేందుకు సిట్ పన్నాగం పన్నింది. హఠాత్తుగా సోదాల డ్రామాకు తెరతీసింది. కోర్టు అనుమతి లేకుండానే 20 మందితో కూడిన సిట్ బృందం సోదాలు అంటూ హంగామా చేసింది. సోదాలపై కోర్టు అనుమతి పత్రం చూపించాలన్న వికాట్ ఉద్యోగులతో సిట్ అధికారులు దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. పోలీస్ మార్క్ గూండాగిరితో భయపెట్టేందుకు ప్రయత్నించారు.

కుంభకోణం జరిగితేనే కదా?

లేని కుంభకోణం ఉన్నట్టు చూపించాలన్న సీఎం చంద్రబాబు కుట్ర క్షేత్రస్థాయిలో బెడిసికొడుతోంది. ఈ పరిణామాలన్నీ సిట్ దర్యాప్తు డొల్లతనాన్ని బట్టబయలు చేస్తున్నాయి. దాంతో బాలాజీ గోవిందప్ప బెయిల్ ను అడ్డుకునేందుకు సిట్ సోదాలకు దిగింది. తద్వారా ఈ కేసు ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని చెబుతూ కోర్టును తప్పుదారి పట్టించాలన్నది సిట్ పన్నాగం. ఆ నెపంతో బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకోవాలన్నది లక్ష్యం.

బాలాజీ గోవిందప్ప డైరెక్టర్‌గా ఉన్న వికాట్ కంపెనీ కార్యాలయంలో సిట్ సోదాలు పక్కా పన్నాగమే. ఎందుకంటే, మే 13న అక్రమంగా అరెస్టు చేసే సమయంలోనూ ఇదే రీతిలో ఆయన నివాసంలో సిట్ అధికారులు రోజంతా సోదాలు చేశారు. ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో బాలాజీ గోవిందప్ప కుమారుడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లను జప్తు చేసి సిట్ తన దిగజారుడుతనాన్ని ప్రదర్శించింది. ఆ వస్తువులు తనవి కావని బాలాజీ గోవిందప్ప కోర్టులో పిటిషన్ కూడా వేశారు. సీజ్ చేసిన వస్తువును తిరిగి అప్పగించాలని, సంబంధిత వ్యక్తులకు ఇచ్చేస్తామని కోరారు. ఇక ఆయన నివాసంలో గానీ, జప్తు చేసినట్టు ప్రకటించిన ఎలక్ట్రానిక్ పరికరాల్లో గానీ సిట్ ఆధారాలు చూపలేకపోయింది. దాంతో సిట్ పన్నాగం ఫలించలేదు. 75 రోజులు రిమాండ్‌లో ఉన్నా సరే దర్యాప్తులో కనీస పురోగతి సాధించలేదు.

చెదిరిపోతున్న చంద్రబాబు కుట్రలు

3.58 లక్షల జీబీల డేటా ధ్వంసం అంటూ ఈనాడు దుష్ప్రచారం

రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్‌లో 3.58 లక్షల జీబీల డేటాను వైఎస్సార్‌సీపీ వర్గీయులు నాశనం చేశారని... 375 పేజీల డేటాను డిలీట్ చేశారని ఈనాడు సహా ఎల్లో మీడియా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసింది. దీనిపై ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద బెవరేజస్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేశారు. ''అసలు మా వద్ద అలాంటి డేటానే ఏనాడూ లేదు. మేం ఎలాంటి డేటాను డిలీట్ చేయలేదు''అంటూ స్వయంగా టీడీపీ కూటమి ప్రభుత్వంలోని బెవరేజస్ కార్పొరేషనే లిఖితపూర్వకంగా తెలిపింది. అంటే, అక్రమ కేసుపై ఎల్లో మీడియా చేస్తున్నదంతా దుష్ప్రచారమేనని నిర్ధారణ అయింది. చంద్రబాబు, లోకేశ్ సిట్‌ను అడ్డుపెట్టుకుని కట్టుకథలు అల్లుతూ... వందల కొద్దీ ఎల్లో యూట్యూబ్ చానళ్లను సృష్టించి, టీడీపీ పెయిడ్ ఆర్టిస్టులను నిపుణులు, పాత్రికేయులుగా నమ్మిస్తూ భారీగా డబ్బులు ఎరవేసి విష ప్రచారం సాగిస్తున్నారని స్పష్టమైంది.

హైదరాబాద్‌లోని బాలాజీ గోవిందప్ప నివాసంలో సిట్ సోదాలు

- వికాట్, భారతీ సిమెంట్స్ కార్యాలయాల్లో కూడా!
- 2 ప్రత్యేక బృందాలతో ఐదున్నర గంటల పాటు సోదాలు


హైదరాబాద్‌లోని బాలాజీ గోవిందప్ప నివాసంలో సిట్ సోదాలు

సాక్షి, హైదరాబాద్: మద్యం అక్రమ కేసులో సిట్ అధికారులు ఏఎస్పీ స్నేహిత నేతృత్వంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వికాట్ గ్రూప్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప నివాసంలో శనివారం సోదాలు నిర్వహించారు. సిట్ గతంలోనూ సుదీర్ఘంగా సోదాలు చేసినా.. ఆయనకు వ్యతిరేకంగా ఒక్క ఆధారమూ కోర్టులో ప్రవేశ పెట్టలేకపోయింది. మరోవైపు ఏసీబీ కోర్టులో బాలాజీ గోవిందప్ప వేసిన బెయిల్ పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుందని, దానిని అడ్డుకునేందుకే సోదాల పేరుతో సిట్ అధికారులు కొత్త నాటకానికి తెర లేపారని గోవిందప్ప న్యాయవాదులు అంటున్నారు. బంజారాహిల్స్‌లోని వికాట్, భారతీ సిమెంట్స్ ప్రధాన కార్యాలయంలోనూ సిట్ సోదాలు నిర్వహించింది. డీఎస్పీ శ్రీనివాస్, ఆరుగురు పోలీసుల బృందంతో కలిసి సుమారు ఐదున్నర గంటలు సోదాల్లో పాల్గొన్నారు. బాలాజీ గోవిందప్ప చాంబర్లు, పరిసర ప్రాంతాలను సోదా చేసినట్లు ఆయన తెలిపారు. కొన్ని డిజిటల్ డివైజ్‌లను సీజ్ చేశామని, వాటిలో ఏముందనేది విచారణలో తేలుస్తామని చెప్పారు. కాగా, సోదాలు నిర్వహించేందుకు వస్తున్నామని సిట్ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ఎవరు సోదాలు నిర్వహిస్తున్నారనేది బంజారాహిల్స్ ఠాణా రికార్డులో పేర్కొనలేదని తెలిసింది. కేవలం ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులు మాత్రమే... బాలాజీ గోవిందప్ప, భారతీ సిమెంట్స్ కార్యాలయంలో సోదాకు వస్తున్నట్లు రికార్డులో పేర్కొన్నట్లు సమాచారం.

అప్పుల్లో ఏపీ టాప్

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించిన నివేదికల ప్రకారం ఏపీప్రభుత్వం గత మూడు నెలల (2025 ఏప్రిల్, మే, జూన్) కాలంలో రూ.37,093 కోట్ల అప్పులను సేకరించింది. ఏపీతో పోలిస్తే తెలంగాణ ఒకింత తక్కువే అయినా రూ. 20 వేల కోట్ల అప్పుల చిట్టా ను దాటిపోయింది. తెలంగాణతో కొంచెం అటూ ఇటుగా కేరళ, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాలుండగా, మధ్యప్రదేశ్ మాత్రం తెలంగాణ కంటే ఎక్కువగానే అప్పులు తీసుకుంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల పరంగా చూస్తే ఏపీ ఎవరికీ చిక్కనంత దూరంలో నిలిచింది. జాబితాలో ఏపీ తర్వాత తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలున్నాయి.

2025-26 తొలి త్రైమాసికంలో టాప్-10 రాష్ట్రాల అప్పులు ఇలా... (రూ. కోట్లలో)

రాష్ట్రం	ఏడాది లక్ష్యం	తీసుకున్నది
ఆంధ్రప్రదేశ్	79,926.89	37,093.98
మధ్యప్రదేశ్	78,902.09	26,163.94
తెలంగాణ	54,009.74	20,266.09
తమిళనాడు	1,06,963.22	19,377.20
కేరళ	45,042.54	17,888.17
రాజస్తాన్	84,643.63	17,175.70
పంజాబ్	34,201.11	9,365.25
ఛత్తీస్‌గఢ్	54,004.02	3,866.60
గుజరాత్	58,397.41	3,499.58
కర్ణాటక	90,428.23	3,368.78

సగానికి చేరువగా...!

వాస్తవానికి, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంత మొత్తంలో రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటాయి. ఈ మేరకు వార్షిక బడ్జెట్ అంచనాల్లో ప్రతిపాదించి అసెంబ్లీ ఆమోదం తీసుకుని ఏడాదిపాటు ఆ రుణాలను క్రమంగా తీసుకుంటాయి. కానీ ఏపీ మాత్రం కేవలం మూడు నెలల కాలంలోనే ఏడాది మొత్తం లక్ష్యంగా పెట్టుకున్న అప్పుల్లో దాదాపు సగం అప్పుడే తీసేసుకున్నట్లు కాగ్ లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కల ప్రకారం రూ.79,926.89 కోట్లను 2025-26 ఆర్థిక సంవత్సరంలో అప్పుల పద్దు కింద సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించగా, అందులో 46.40 శాతం అంటే రూ. 37,093.98 కోట్లను అప్పుడే తీసేసుకుంది. ఇక, తెలంగాణ రూ. 54,009.74 కోట్ల రుణ సేకరణ లక్ష్యంగా పెట్టుకుని తొలి మూడు నెలల కాలంలో 37.52 శాతం అంటే రూ. 20,266.09 కోట్లను సమకూర్చుకుంది.

ఏపీ ఆర్థిక పరిస్థితి దారుణం

- గతేడాది తొలి త్రైమాసికంతో పోల్చితే మరింత దిగజారుడు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆందోళన



సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిందంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) మొదటి త్రైమాసికంతో పోల్చితే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వ పన్ను, పన్నేతర ఆదాయాలు భారీగా తగ్గాయని ఎత్తిచూపారు. రాష్ట్రంలో అవినీతి విశృంఖలత్వం వల్ల ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోందని మండిపడ్డారు. ప్రతి మంగళవారాన్ని అప్పులవారంగా మార్చుకున్న చంద్రబాబు.. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 15.61 శాతం అధికంగా అప్పులు చేశారంటూ దెప్పి పొడిచారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన కీలకమైన ఆర్థిక సూచీ (ఇండికేటర్)లను ఉటంకిస్తూ చంద్రబాబు సర్కారు ఆర్థిక విధానాలను కడిగిపారేశారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

తగ్గిపోయిన ప్రజల కొనుగోలు శక్తి

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన నెలవారీ కీలక ఆర్థిక సూచీల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. విభజన అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారి, ఒక సవాలుగా నిల్చింది. సంక్షేమం, అభివృద్ధి.. రెండింటికి ఎప్పుడైతే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి.. ఆ దిశగా వ్యయం చేస్తుందో, అప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, పెట్టుబడులు కూడా పెరుగుతాయి. ఇది అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది.
- కానీ.. అంతులేని అవినీతి వల్ల రాష్ట్ర ఆదాయం దారుణంగా పడిపోతోంది. మరోవైపు అన్ని రంగాల్లో వృద్ధి పూర్తిగా తిరోగమనం కావడం కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో తొలి 3 నెలలకు సంబంధించి చూస్తే పన్ను, పన్నేతర ఆదాయాలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి.
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు కొన్ని విభాగాల్లో అతి తక్కువ వృద్ధి ఉంటే.. మరికొన్ని విభాగాల్లో వృద్ధి తగ్గింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోతోందనడానికి నిదర్శనం.
- గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ), అమ్మకం పన్నుల ఆదాయం ఏస్థాయిలో తగ్గిందనేది ఇప్పుడు కాగ్ విడుదల చేసిన నివేదిక చూపుతోంది.
- గత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి త్రైమాసికం రాష్ట్ర సొంత ఆదాయంలో కేవలం 3.47 శాతం, ఇతర ఆదాయాలు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వ ఆదాయంలో మొత్తం 6.14 శాతం వృద్ధి మాత్రమే ఉంది. కానీ, ఇదే సమయంలో రాష్ట్ర అప్పులు ఏకంగా 15.61 శాతం పెరగడం దారుణం. అంటే.. రాష్ట్ర ప్రభుత్వం తన ఖర్చుల కోసం ఆదాయం పెంచుకునే మార్గాలపై కాకుండా, పూర్తిగా అప్పులపైనే ఆధార పడుతోందన్న విషయం స్పష్టమవుతోంది. ఇది ఆందోళనకరంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టుల మృతి
- అధునాతన ఆయుధాల స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం సాయంత్రం మరోమారు తుపాకుల మోత మోగింది. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో.. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. అక్కడ తారసపడిన మావోయిస్టులు భద్రతా బలగాల పైకి కాల్పులు జరిపాయి. భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగడంతో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. కాగా, మృతులను ఇంకా గుర్తించలేదు. సంఘటన స్థలంలో ఇన్‌సాస్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్ తదితర అధునాతన ఆయుధాలు లభించడంతో మృతులు మావోయిస్టు ముఖ్య నేతలుగానే అనుమానిస్తున్నారు. ఘటనాస్థలి నుంచి పలువురు మావోయిస్టులు తప్పించుకున్నట్లు తెలుస్తుండగా.. అక్కడ కూంబింగ్‌ను ముమ్మరం చేసేందుకు అదనపు బలగాలను తరలిస్తున్నారు. కాగా, ఎన్‌కౌంటర్ ఘటనను శనివారం రాత్రి వరకు పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

జిల్లా వార్తలు

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన


నారాయణపురంలో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించేందుకు జాతీయ స్థాయి పర్యవేక్షణ(ఎన్ఎల్ఎం) బృందం సత్తుపల్లి మండలంలోని నారాయణపురం, కాకర్లపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు, గ్రామ సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఉపాధి హామీ పనులతో లబ్ధి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు అందుతున్న పింఛన్లపై ఆరా తీశారు. అలాగే, గ్రామాల్లో రోడ్ల వెంట నాటిన మొక్కలు, ఫీడర్ ఛానల్ పూడికతీత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కేంద్ర బృందంలో డాక్టర్ గరుడ, ఎస్.అశ్విన్ గోపాల్ తదితరులు ఉండగా, కల్లూరు ఏపీడీ చలపతిరావు, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, డీఈ వెంకటేశ్వరరావు, ఏపీఓ బాబురావు, ఏపీఎం కృష్ణయ్య పాల్గొన్నారు.

పత్తి, పెసరలో తెగుళ్ల నివారణపై అవగాహన


పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొణిజర్ల: కొణిజర్లలో సాగవుతున్న పత్తి, పెసర పంటలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ పీఎస్ఎం.ఫణిశ్రీ, విజయ తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరుస వర్షాలతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పత్తి చేన్లలో నీరు చేరితే వేరుకుళ్లు తెగులు రానున్నందున కాల్వలు కొట్టి నీరు తొలగించాలని సూచించారు. అలాగే, ఎకరాకు 25 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ మొక్క సమీపాన చల్లి మట్టి కప్పాలని, నేల ద్వారా తెగుళ్ల వ్యాప్తి చెందకుండా కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా యూరియాను నీటిలో వారానికి రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. అంతేకాక పెసరలో ఆకుపచ్చ తెగులు నివారణకు కాపర్‌ఆక్సీ క్లోరైడ్ లేదా మంకోజెబ్ పది రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓ బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.

రికార్డు సమయంలో 'ఎత్తిపోతలు'

- త్వరగా పూర్తయిన ప్రాజెక్టుగా మంచుకొండ లిఫ్ట్
- రూ.66 కోట్ల నిధులతో నాలుగు నెలల్లో నిర్మాణం


డెలివరీ పాయింట్ వద్ద అధికారులు, రైతులు, నాయకులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని చెరువులకు నీరు సరఫరా చేసి, ఆయకట్టుకు అందించేలా వీ.వీ.పాలెం సాగర్‌ప్రధాన కాల్వలపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం రికార్డు సమయంలో పూర్తయిందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. రూ.66 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టును కేవలం నాలుగు నెలల్లోనే పూర్తి చేయడం విశేషం. సాగర్ ప్రధాన కాల్వపై ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా మండలంలోని అన్ని చెరువులకు పైప్‌లైన్ల ద్వారా నీరు చేరుస్తారు. పంప్ హౌస్ నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, మోటార్లు, పంపు సెట్ల ఏర్పాటు వంటి కీలక పనులన్నీ అతి తక్కువ సమయంలో పూర్తయిన ఎత్తిపోతల పథకం రాష్ట్రంలో ఇదే మొదటిదని అధికారులు చెబుతున్నారు. ఇంజనీరింగ్ శాఖ నిపుణులు, జలవనరుల శాఖ అధికారులు, శాఖ రాష్ట్ర సలహాదారుడు పెంటారెడ్డి పర్యవేక్షణలో కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు రాత్రీపగలు తేడా లేకుండా పనులు చేపట్టడంతో ఈ ఫలితం నమోదైందని భావిస్తున్నారు. అంతేకాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పర్యవేక్షిస్తుండడంతో పనులు వేగంగా జరిగాయి. ఇప్పటికే మూడు మోటార్ల ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తవగా.. త్వరలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి మండలంలోని చెరువులకు, ఆపై ఆయకట్టుకు నీరు సరఫరా చేయనున్నారు.

రైతుల్లో ఆనందం

రఘునాథపాలెం మండలంలోని చెరువులకు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్ జలాలు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో ఇన్నాళ్లు వర్షాధారంగానే చెరువులు నిండుతుండగా, సాగుకు ఇబ్బంది ఎదురుకావొద్దని మంచుకొండ వద్ద సాగర్ ప్రధాన కాల్వపై ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకంలోని మూడు మోటార్ల ట్రయల్ రన్ విజయవంతం కాగా, డెలివరీ పాయింట్ వద్దకు నీరు చేరుతోంది. ఈమేరకు రైతులు, నాయకులు శనివారం డెలివరీ పాయింట్ వద్ద సంబురాలు చేసుకున్నారు. అంతేకాక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పుష్పాభిషేకం చేశారు. అలాగే, పథకాన్ని రికార్డు సమయాన పూర్తిచేయడంలో కీలకంగా వ్యవహరించిన జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం మార్కెట్, ఆత్మ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తాతారావుతో పాటు నాయకులు వాంకుడు దీపక్‌నాయక్, కొంటెముక్క నాగేశ్వరరావు, బాలాజీనాయక్, కేలోత్ దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి రూ.4.32 కోట్లు


నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని రాయగూడెం, కొంగర, కట్టుకాచారం, బుద్దారం, అప్పలనరసింహాపురం గ్రామాల ప్రజల అవస్థలకు తెరపడే సమయం ఆసన్నమైంది. ఏళ్ల తరబడి రాయగూడెం-బుద్దారం మధ్య వాగుపై వంతెన లేకపోవడంతో వరదల సమయాన ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈమేరకు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.32 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, నాగేశ్వరరావు, గోవిందరావు, నంబూరి రామారావు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: సంగారెడ్డిలో ఈనెల 27వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సీనియర్ కేటగిరీలో పి.పవిత్రాచారి, డి.హర్షిణి, టి.సాయి భవ్యశ్రీ ఎంపిక కాగా, టెక్నికల్ ఆఫీషియల్‌గా జిల్లా వాసి పి.సత్యజిత్‌చారి వ్యవహరించానున్నారు. వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణచారి శనివారం అభినందించారు.

ఐదుగురికి ఏఎస్సైలుగా పదోన్నతి


పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న సీపీ

ఖమ్మం క్రైం: ఖమ్మం కమిషనరేట్‌లోని పలు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురికి ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఈ జాబితాలో సీహెచ్.నాగేశ్వరరావు, ఎస్.హర్యా, సీహెచ్.చంద్రశేఖర్, బి.కిషన్, ఖాజామొహినుద్దీన్ ఉన్నారు. ఈ సందర్భంగా వీరిని శనివారం సీపీ సునీల్‌దత్ అభినందించారు.

జాతీయ సదస్సుకు ఖమ్మం జిల్లా ఉపాధ్యాయుడు


ప్రభాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: నూతన జాతీయ విద్యానంపై ఢిల్లీలో ఈనెల 29న జరగనున్న జాతీయ స్థాయి సదస్సులో పాల్గొనాల్సిందిగా తిరుమలాయపాలెం జెడ్పీహెచ్ఎస్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించనుండగా, నేషనల్ మిషన్ ఫర్ మెంటారింగ్‌లో సభ్యుడైన ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం పంపించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి విద్యారంగ ప్రముఖులు, విషయ నిపుణులు, నేషనల్ మెంటారింగ్ మిషన్ సభ్యులు పాల్గొని నూతన విద్యావిధానంపై చర్చించనున్నారు. కాగా, జాతీయ సదస్సుకు ఎంపికైన ప్రభాకర్‌రెడ్డిని డీఈఓ సత్యనారాయణ ఏఎంఓ రాజశేఖర్, ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్ఎం విజయకుమారి అభినందించారు.

భూమి ఆధారంగా యూరియా పంపిణీ

తల్లాడలో పరిశీలించిన సీపీ సునీల్‌దత్


గంగదేవిపాడు సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

తల్లాడ: తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. గంగదేవిపాడు సొసైటీకి 15 టన్నుల యూరియా వచ్చిందని తెలియడంతో ఎనిమిది గ్రామాల నుంచి పాస్‌బుక్, ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లతో ఉదయమే చేరుకున్నారు. దీంతో అందరికీ యూరియా సరఫరా చేయాలనే భావనతో ఎకరం భూమి కలిగిన రైతుకు ఒకటి, 5 – 10 ఎకరాలు ఉంటే రెండు బస్తాల చొప్పున పంపిణీకి నిర్ణయించారు. ఈమేరకు ఏఓ ఎం.డీ.తాజుద్దీన్‌తో కూపన్లు జారీచేయించగా పీఏసీఎస్ చైర్మన్ తూము వీరభద్రరావు, అధికారులు పర్యవేక్షించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు...

ఖమ్మం వ్యవసాయం/ఖమ్మం రూరల్/తల్లాడ: వరుస వర్షాలతో పంటల సాగు పెరుగుతుండడంతో యూరియా అవసరం సైతం పెరుగుతోంది. దీంతో చాలాచోట్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు జిల్లా వ్యాప్తంగా గోదాంలు, సొసైటీల్లో తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న స్టాక్, రిజిస్టర్లలో వివరాలను సరిపోల్చడమే కాక రైతులను ఇబ్బంది పెట్టకుండా సరఫరా చేయాలని డీలర్లకు సూచించారు. కాగా, తల్లాడ మండలం గంగదేవిపాడు, తల్లాడ సొసైటీల వద్ద యూరియా పంపిణీని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. స్టాక్ వివరాలు, ఇంకా అవసరమనే వివరాలు ఆరా తీశారు. అలాగే, ఖమ్మంరూరల్ మండలంలోని చినతండాలోని ఏదులాపురం పీఏసీఎస్ జిల్లా వ్యవసాధికారి ధనసరి పుల్లయ్య సందర్శించారు. గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశాక నిర్వాహకులకు సూచనలు చేశారు. సరిపడా నిల్వలు ఉన్నందున రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. అనంతరం పల్లెగూడెంలోని ఎరువుల షాపుల్లోనూ తనిఖీ చేయగాఏఓ ఉమానగేష్, పీఏసీఎస్ సీఈఓ మహమూద్‌అలీ, ఏఈఓలు పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడిపై దృష్టి సారించండి

వైద్య, ఆరోగ్య శాఖ ఏడీ అమర్ సింగ్


వీసీలో మాట్లాడుతున్న ఏడీ అమర్‌సింగ్

ఖమ్మం వైద్యవిభాగం: దోమల ద్వారా వచ్చే వ్యాధుల కట్టడిపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ ఆదేశించారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయన డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఉద్యోగులతో సమీక్షించారు. వర్షాకాలంలో దోమల ద్వారా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందనున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమలు, లార్వా నివారణకు ఫాగింగ్ చేయించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా డెంగీ వ్యాప్తికి అవకాశాలు ఉన్నందున లక్షణాలు కనిపించిన వారికి పరీక్ష చేసి చికిత్స మొదలుపెట్టాలని తెలిపారు. ఈ వీసీలో డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి, ప్రోగ్రాం అధికారులు వెంకట రమణ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

18.60 అడుగులకు చేరిన పాలేరు


వరదను ఏటిలోకి మళ్లించేలా కాల్వ తవ్వుతున్న యంత్రాలు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం శనివారం సాయంత్రానికి 18.60 అడుగులకు చేరింది. సాగర్ నుండి 3,965 క్యూసెక్కుల నీటి సరఫరా కొనసాగుతుండగా మరో 100 క్యూసెక్కుల మేర వరద ప్రవాహం చేరుతోంది. ఇదే సమయాన రిజర్వాయర్ నుంచి దిగువకు 1,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే, ఔట్ ఫ్లో కన్నా ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో రెండు రోజుల్లో రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టమైన 23 అడుగులకు చేరనుంది. కాగా, పాలేరు రిజర్వాయర్ సమీపాన ఎడమ కాల్వకు కొత్తగా యూటీ(అండర్ టన్నెల్) నిర్మాణం పూర్తికావడంతో ఎగువన ఉన్న పొలాల మీదుగా వచ్చే వరదను యూటీ ద్వారా సమీపంలోకి ఏటికి మళ్లించారు.